అడవి కావాలి... అభివృద్ధి కావాలి

- ఆదివాసీల అభ్యున్నతికి అడ్డుగా ఉన్న చట్టాలను మార్చాలి
- మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానవ మనుగడకు అడవీ, అడవితో పాటు అభివృద్ధి అవసరమని మహిళా, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) అభిప్రాయపడ్డారు. అయితే ఆదివాసీల అభ్యున్నతికి అటవీ, అభయారణ్య చట్టాలు తరచూ ఆటంకంగా మారుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత చట్టాలను పునర్వ్యవస్థీకరిస్తేనే గిరిజనులు, ఆదివాసీలు, ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లోని ఆదివాసీల కోసం ఉద్దేశించిన పథకాల లక్ష్యాలు నెరవేరుతాయని ఆమె వివరించారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో "పిఎం జన్మన్, ధర్తి అబ జనజాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్" పథకంపై సౌత్ ఈస్ట్ రాష్ట్రాల ప్రాంతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఉన్నతాధికారులతో పాటు చత్తీస్ ఘడ్, ఒడిశా, జార?ండ్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాల గిరిజన సంక్షేమశాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఈ పథకం కింద గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి, విద్య, వైద్యం, జీవనోపాధి, మౌలిక సదుపాయాల కల్పన కోసం 17 శాఖలను సమన్వయం చేసే ప్రయత్నం బాగుందని అభినందించారు. 63,843 గ్రామాలు, 5 కోట్ల మంది ఎస్టీల కోసం ఏటా రూ.15,830 కోట్లను ఖర్చు చేసేందుకు కేంద్రం ముందుకు రావడాన్ని ఆమె స్వాగతించారు. ఇటీవల రాష్ట్రంలో గిరిజనులు, ఆదివాసీ ప్రాంతాలు, ఏజెన్సీ ఏరియాల అభివద్ధి కోసం పలు శాఖలతో నిర్వహించిన సమీక్షల అనుభవాన్ని ఆమె పంచుకున్నారు. గిరిజన జనాభా అధికంగా ఉన్న ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, నాగర కర్నూల్ జిల్లాల ప్రజా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, ప్రజా సంఘాలతో చర్చించినట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిస్తున్న చేయూతతో మైదాన ప్రాంతాల్లోని ఎస్‌టిలు అభివృద్ధి చెందుతున్నా... ఆదివాసీలు, ప్రిమిటివ్ ట్రైబ్స్ అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. అక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు ఆటంకంగా ఉన్న అభయారణ్య చట్టాలపై అటవీశాఖ అధికారులతో చర్చిస్తున్నా అభివృద్ధి ముందుకు సాగడం లేదని వెల్లడించారు. 1980కి ముందున్న గ్రామాల్లో అభివృద్ధికి అడ్డు చెప్పొద్దని అటవి చట్టాలు చెబుతున్నా..కేంద్ర ప్రభుత్వం నుంచి చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయంతో ఫారెస్టు అధికారులు అభివృద్ధి పనులు ముందుకు సాగనివ్వడం లేదని తెలిపారు. అభివృద్ధి వర్సెస్ అటవి చట్టాలు అన్నట్లుగా పరిస్తితి మారిందని వివరించారు.

తాను ప్రాతినిథ్యం వహిస్తున్న ములుగులో 77 శాతం అడవి ఉందనీ, అందుకే దాన్ని ట్రైబల్ క్యాపిటల్ ఆఫ్ తెలంగాణగా పిలుస్తారని చెప్పారు. అక్కడ ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన కనీసం మంచి నీటి సౌకర్యం, కనీస రోడ్లు వేయలేకపోతున్నట్టు తెలిపారు. గుడిసెల్లో ఉన్న పాఠశాలకు పక్కా భవనాలు నిర్మిద్దామనుకున్నా అటవి అనుమతులు రావడం లేదు. అంగన్ వాడీకేంద్రాలు, ఆసుపత్రులు, నిర్మిద్దామన్నా అనుమతులు రావడం లేదు. దీంతో చేసేదేమి లేక తప్పనిసరి పరిస్తితుల్లో కంటెనర్ స్కూళ్లను, ఆస్పత్రులను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. అటవీ ప్రాంతాలలో తక్షణ వైద్య సహాయం అందించుటకు నూతన ఆలోచనతో తాత్కాలిక కంటైనర్లను సమ్మక్క- సారలమ్మ తాడ్వాయి మండలంలో పోచాపుర్‌లో, వాజెడు మండలంలోని ఏడ్చర్లపల్లిలో నిర్మించినట్టు చెప్పారు. ఐటీడీఏ ఏటూరు నాగరం అధికారులు సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేశారనీ, అక్కడ ఆదివాసీ గిరిజనులు ఉదయం తమ మొబైళ్లను చార్జింగ్ పెట్టుకుని..రాత్రి టార్చిలైట్లుగా వినియోగించుకుంటున్నారని పరిస్థితిని వివరించారు. మంచినీటి బోర్లు కూడా వేయనీయడం లేదని సీతక్క కేంద్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ చట్టాల కారణంగా అడవి వర్సెస్ అభివృద్ధి అన్నట్టుగా తయారైందని తెలిపారు. ఏ పథకమైనా సరే అభివృద్ధిలో చిట్టచివరి వ్యక్తికి, ఆవాసానికి అభివృద్ధి ఫలాలు చేరినప్పుడే ఆయా పథకాల లక్ష్యాలు నెరవేరినట్టని చెప్పారు. పట్టణాల్లో స్కై వే, హై వేలు వస్తుంటే..అదివాసి గూడాల్లో కనీసం మట్టి రోడ్లు రాకపోతే సమాజంలో ఉన్న అంతరాలు ఎప్పుడు పోతాయని ఆమె ప్రశ్నించారు. అటవీ ప్రాంతాల్లో భారీ ప్రాజెక్టులకు అనుమతిలిచ్చినట్టుగానే అంతే వేగంగా అడవి బిడ్డల సదుపాయాలకు అనుమతిలివ్వాలని ఆమె కోరారు. ఆదిలాబాద్‌లోని ఒక గ్రామానికి రోడ్డును అటవీ ప్రాంతం గుండా వేసేందుకు రూ.9 కోట్లు ఖర్చవుతుందని ఇంజినీర్లు అంచనా వేశారనీ, ఆ రోడ్డు వేసేందుకు రూ.76 కోట్లు పెనాల్టి కట్టాలని అటవీ శాఖ చెబుతున్నదని ఇబ్బందిని ఆమె వివరించారు. ప్రతి చోటా ఇలాంటి పరిస్థితే ఉందని చెప్పారు.

10 రోజుల్లో అటవీ అధికారులతో సమావేశం కేంద్ర అడిషనల్ సెక్రెటరీ మనీష్ ఠాకూర్, డైరెక్టర్ సమీదా సింగ్

కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల అధికారులతో 10 రోజుల్లో ఢిల్లీలో ఆయా రాష్ట్రాలతో సమావేశం ఏర్పాటు చేస్తామని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ సెక్రెటరీ మనీష్ ఠాకూర్, డైరెక్టర్ సమీదా సింగ్ హామీ ఇచ్చారు. అంతకుముందు వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆయా రాష్ట్రాల ప్రతినిధులు అభివృద్ధి కార్యక్రమాలకు అటవీ, పర్యావరణ శాఖల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించారు. ఈ సమావేశంలో సీఎస్ రామకష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనల సంక్షేమం, అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. గిరిజన ప్రభావిత ప్రాంతాల్లో తాను కలెక్టర్‌గా చేసినప్పటి అనుభవాలను వారితో పంచుకున్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎ.శరత్ తదితరులు పాల్గొన్నారు.

'తాండూర్ బైపాస్' భూ బాధితులకు పరిహారం చెల్లించాలి

- సిపిఎం, ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లా తాండూరు బైపాస్ రింగ్ రోడ్డు భూ బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ సిపిఎం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సిటైఐయు ఆధ్వర్యంలో బాధితులతో కలిసి వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తాండూర్‌లో బైపాస్ రింగ్ రోడ్ కోసం కోకాట్, అంతారం, చెంగోల్, మిగతా గ్రామాల్లో నివసించే పేద ప్రజల నుంచి స్థలాలు సేకరించిందని తెలిపారు. నోటీసులు కూడా ఇవ్వకుండా భూములు లాక్కున్నారని తెలిపారు. కనీసం వీరికి నష్టపరిహారం కూడా చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ బాధితులు తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బాధితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ప్లాట్లు కోల్పోయిన బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు యు.బుగ్గప్ప, ఎం.వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బస్సు చంద్రయ్య, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ హక్కుల పోరాట సంఘం అధ్యక్షులు చంద్రయ్య, ఎంహెచ్‌పిఎస్ తాండూర్ నియోజకవర్గ కన్వీనర్ సమియుద్దీన్, బాధితులు ఎస్ శ్రీనివాస్, సివి రమేష్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, కె సమర్, శివ, విష్ణు, శేఖర్, వెంకటమ్మ, రాజు, నర్సింలు, వెంకటేష్, అశోక్, అనంతమ్మ, శేఖర్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్లు

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్‌డిఓ కార్యాలయంలో హుస్నాబాద్ మండలానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు శుక్రవారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేండ్లలో హుస్నాబాద్ మండలానికి 40 ఇండ్లు మాత్రమే ఇచ్చారన్నారు. కానీ ఇప్పుడు ఏడాదికి 200 ఇండ్ల చొప్పున నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. పునాదులు పెద్దగా వేస్తే పైసలు రావని.. ప్రభుత్వ నిబంధనల మేరకే ఇండ్లు నిర్మించాలన్నారు. అర్హులైన పేదలకు మాత్రమే ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఒకవేళ అనర్హులకు ఇల్లు మంజూరైతే వాటిని రద్దుచేస్తామని చెప్పారు. లబ్దిదారులకు ఫ్రీ ఇసుక ట్రాక్టర్ కూపన్లు వస్తాయన్నారు. అంతేకాకుండా ఉపాధి హామీ పని కింద మరుగుదొడ్లు కూడా నిర్మించుకోవచ్చని తెలిపారు. ఇంకుడు గుంతలకు కూడా డబ్బులు ఇస్తారన్నారు. ఇండ్ల నిర్మాణానికి డబ్బులు కావాలని అనుకుంటే మహిళా సంఘాల నుంచి లక్ష రూపాయలు రుణం ఇస్తున్నట్టు చెప్పారు. ప్రజా సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తున్నామన్నారు. హుస్నాబాద్ నియోజవర్గం మొత్తంలో డబుల్ రోడ్లు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్, సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విద్యుత్ వైర్లు పట్టివేత

హైదరాబాద్ : నగరంలో నకిలీ విద్యుత్ ఉత్పత్తులపై పెద్ద ఎత్తున పోలీసు దాడులు నిర్వహించారని తెలుస్తోంది. ఇటీవల జాంబాగ్‌లోని ఒక గోదాముపై దాడి చేసి నకిలీ విద్యుత్ వైర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ గోదాం రతన్ సింగ్‌కు చెందినదిగా గుర్తించారు. ఆయనను అరెస్టు చేసి, అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఆ వర్గాలు తెలిపాయి.

నేడు మిస్ వరల్డ్ ఫైనల్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

72వ మిస్ వరల్డ్ గ్రాండ్ ఫైనల్స్ హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మే 31న సాయంత్రం 6:30 గంటలకు జరగనుంది. ఈ మేరకు మిస్ వరల్డ్ నిర్వాహకులు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా 108 మంది వివిధ దేశాల పోటీదారులు అందం, ఉద్దేశం, ఐక్యతను జరుపుకునే ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ కిరీటం కోసం పోటీపడతారు. సుమారు 20 రోజుల పాటు జరిగిన వివిధ కార్యక్రమాల్లో వీరంతా పాల్గొని తమ ప్రతిభను చాటటంతో పాటు, రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించారు. తెలంగాణ జరూర్ ఆనా నినాదాన్ని ప్రపంచవ్యాప్తం చేశారు. ఫైనల్స్‌కు మిస్ వరల్డ్ 2016 స్టెఫానీ డెల్ వాలె, భారతీయ ప్రెజెంటర్ సచిన్ కుంభర్ హోస్ట్‌లుగా వ్యవహరిస్తారు. బాలీవుడ్ తారలు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ ఖట్టర్ ఫైనల్స్‌లో స్టేజ్‌పైన లైవ్ ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ప్రముఖ మానవతావాది, నటుడు సోనూ సూద్‌కు మిస్ వరల్డ్ హ్యూమానిటేరియన్ అవార్డు ప్రధానం చేయనున్నారు. ఆయన ఫైనల్స్‌కు న్యాయ నిర్ణేతగా కూడా వ్యవహరిస్తారు. ఇతర జ్యూరీలుగా సుధా రెడ్డి, డాక్టర్ కారినా టర్రెల్ (మిస్ ఇంగ్లాండ్ 2014), మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ ఉన్నారు. ఈ గ్రాండ్ ఫినాలే భారతదేశంలో సోనీ లైవ్‌లో లైవ్ స్ట్రీమ్ అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా www.watchmissworld.com ద్వారా హై డెఫినిషన్‌లో అందుబాటులో ఉంటుంది.

ఒక్క విద్యార్థీలేని బడులు 1,980

- ప్రభుత్వ స్కూళ్లలో 38.89 శాతం మంది
- ప్రయివేటు పాఠశాలల్లో 61.11 శాతం విద్యార్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ పాఠశాలలు 1,980 ఉన్నాయి. రాష్ట్రంలో 18,259 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలుంటే 1,900 స్కూళ్లు, 3,143 ప్రాథమికోన్నత పాఠశాలలుంటే 40 స్కూళ్లు, 4,704 ఉన్నత పాఠశాలలుంటే 40 స్కూళ్లలో ఒక్క విద్యార్థి కూడా లేకపోవడం గమనార్హం. రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరంలో 30,137 ప్రభుత్వ పాఠశాలల్లో 23,71,772 (38.89 శాతం) మంది విద్యార్థులు చదివారు. 11,757 ప్రయివేటు స్కూళ్లలో 37,26,220 (61.11 శాతం) మంది విద్యనభ్యసించారు. హైదరాబాద్‌లో 8,45,540 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో ప్రయివేటు పాఠశాలల్లో 7,26,529 (85.92 శాతం) మంది ఉన్నారు. ప్రభుత్వ బడుల్లో కేవలం 1,19,011 (14.08 శాతం) చదువుతున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 7,30,873 మంది చదువుతుంటే ప్రభుత్వ పాఠశాలల్లో 93,583 (12.80 శాతం) మంది విద్యనభ్యసిస్తున్నారు. ప్రయివేటు బడుల్లో 6,37,290 (87.20 శాతం) మంది ఉన్నారు. రంగారెడ్డి జిల్లాలో 7,44,923 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో ప్రభుత్వ స్కూళ్లలో 1,60,232 (21.51 శాతం) మంది విద్యనభ్యసిస్తున్నారు. ప్రయివేటు పాఠశాలల్లో 5,84,691 (78.49 శాతం) మంది చదువుతున్నారు. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి ఈ మూడు జిల్లాల్లో 23,21,336 మంది ఉంటే సర్కారు బడుల్లో 3,72,826 (16.06 శాతం) మంది విద్యనభ్యసిస్తున్నారు. ప్రయివేటు పాఠశాలల్లో 19,48,510 (83.94 శాతం) మంది ఉన్నారు.

విద్యార్థుల నమోదు వివరాలు

జిల్లా	ప్రభుత్వ	ప్రయివేటు	మొత్తం
హైదరాబాద్	1,19,011 (14.08 శాతం)	7,26,529 (85.92 శాతం)	8,45,540
మేడ్చల్	93,583 (12.80 శాతం)	6,37,290 (87.20 శాతం)	7,30,873
రంగారెడ్డి	1,60,232 (21.51 శాతం)	5,84,691 (78.49 శాతం)	7,44,923
మొత్తం	3,72,826 (16.06 శాతం)	19,48,510(83.94శాతం)	23,21,336

ప్రజోపకార కార్యక్రమాలు ప్రసారం చేయటం లేదు

- తమిళనాడు పూర్వ గవర్నర్ రామమోహన్ రావు

ప్రజాశక్తి - కల్చరల్

ప్రస్తుతం ఉన్న టీ వి ఛానెల్స్ , సామాజిక మాధ్యమాలైన యు ట్యూబ్, డిజిటల్ మీడియా లో ప్రజోపకార కార్యక్రమాలు ప్రసారం చేయటం లేదని తమిళనాడు పూర్వ గవర్నర్ రామమోహన్ రావు అన్నారు . అవన్నీ కేవలం ఎవరికో ఒకరికీ భజన చేయడం పనిగా పెట్టుకున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వహణ లో విఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు 102 వ జయంతి సందర్భంగా తెలుగు వన్ డాట్ కామ్ స్థాపకుడు కె రవి శంకర్ ఎన్ టి ఆర్ పేరిట పురస్కార ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామమోహన రావు మాట్లాడుతూ రాజకీయ వ్యవస్థ కలుషితమయిందన్నారు. ప్రజాస్వామ్యం మనుగడ కు ముప్పు వాటిల్లుతోందనీ ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాలు ఎన్నికల్లో డబ్బు ప్రభావం తగ్గించేందుకు విశ్లేషణ తో కూడిన చర్చ లు నిర్వహించి ప్రజలను చైతన్య పరిచాలనీ సూచించారు . రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రత, ఆహారం, వైద్యం, విద్య భాధ్యత అని కాని ఉచితం పేరిట అప్పులు చేస్తూ అసలు బాధ్యత విస్మరించింది అని చెప్పారు. అధ్యక్షత వహించిన ఆదాయ పన్నులు శాఖ విశ్రాంత కమిషనర్ నరసింహప్ప మాట్లాడుతూ యెన్ టి ఆర్ తెలుగు అబిమాని అని.. అదే లక్షణాలు రవి శంకర్ లో ఉన్నాయని అన్నారు . 170, దేశాల్లో తెలుగు వన్ డిజిటల్ కోట్లు మంది వీక్షకులుతో ఉందని చెప్పారు .ప్రముఖ కవి ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ తెలుగు జాతి ప్రతిభను ప్రపంచానికీ చాటిన వున్నత విలువలు కల మహనీయుడు యెన్ టి ఆర్ అన్నారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ నిరంతర కషి శ్రద్ధ తో వ్యక్తి ఎదుగుతారని అన్నారు. కేంద్ర పూర్వ మంత్రి సముద్రాల వేణు గోపాలా చారి మాట్లాడుతూ తాము యెన్ టి ఆర్ వల్లే రాజకీయాలు లోకి వచ్చాము అని పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు, మహిళలకు ఆస్తి హక్కు వంటి నిర్ణయాలు ఎన్‌టిఆర్ తీసుకున్నారని చెప్పారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- నకిలీ విత్తనాలపై ఉక్కు పాదం
- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రణాళిక బద్ధంగా అమలు చేసి ఆశించిన ప్రగతి సాధించాలని, సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులు, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అభివృద్ధి, పథకాలపై శుక్రవారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టం ప్రకారం పైలట్ మండలంలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. వానాకాలం సీజన్‌కు పంటల సాగు ప్రణాళిక, విత్తనాలు, ఎరువుల లభ్యతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, ఎక్కువ విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకుంటే యజమానిదే బాధ్యత అని స్పష్టంచేశారు. అయితే, జిల్లా ఎమ్మెల్యేలు కోరినట్టు గ్రామ సభల్లో ప్రకటించిన అర్హుల జాబితా ప్రకారం ఇండ్లు మంజూరు చేసే విషయమై సిఎం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. దేవాదాయ, వక్ఫ్, శిఖం, అసైన్డ్ భూములు ఎన్ని ఉన్నాయన్న వివరాలను కలెక్టర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల నియంత్రణకు ముందస్తు కార్యాచరణను సిద్ధం చేయాలని అన్నారు. గతేడాది మహబూబ్‌నగర్ జిల్లాలో డెంగ్యూ కేసులు అధికంగా నమోదయ్యాయని, ఈ సారి అలా జరగకుండా ముందస్తుగానే వార్డుల వారీగా దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తామని కలెక్టర్ విజయేందిర బోయి మంత్రికి తెలిపారు. నారాయణపేట జిల్లాలోనూ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు లేవని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. నారాయణపేట నుంచి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులను మహబూబ్‌నగర్ నుంచి అంబులెన్స్ డ్రైవర్లు హైదరాబాద్‌లోని వెల్‌నెస్ సెంటర్‌కు తీసుకువెళ్తున్నారని నారాయణపేట, మక్తల్ ఎమ్మెల్యేలు మంత్రికి ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి అంబులెన్స్ డ్రైవర్ల వ్యవహారంపై విచారణ చేపట్టాలని ఆదేశించారు.

కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి : జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు

నకిలీ విత్తనాలపై టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. నారాయణపేట, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఎంత మంది రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సీఎంఆర్ బకాయిలు ఉన్నారని జూపల్లి అధికారులను ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌లో 2023-24కు సంబంధించి ఒక మిల్లర్ రూ.3.7 కోట్ల బకాయి ఉన్నారని, నారాయణపేటలో 10 రైస్ మిల్లర్ల నుంచి 2019-20 నుంచి ఇప్పటిదాకా రూ.53 కోట్ల బకాయి ఉన్నారని అధికారులు తెలపగా, వారి నుంచి కలెక్టర్లు రికవరీ చేయాలని మంత్రి జూపల్లి ఆదేశించారు. ప్రభుత్వ భూములు, అన్యాక్రాంతం భూముల వివరాలు సమాచారం అందించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నంబర్, వాట్సాప్ నెంబర్ ప్రజలకు తెలపాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, జి మధుసూదన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, డాక్టర్ చిట్టెం పర్నికా రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఓబే దుల్లా కొత్వాల్, కలెక్టర్లు విజయేందిర బోయి, సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్లు హాజరయ్యారు.

DECCAN POLYPACKS LIMITED
Regd. Office : Plot No. A-40, Road No. 7, IDA Kukatpally, Hyderabad-37, Telangana, Ph : 040-23077224

EXTRACT OF THE AUDITED STANDALONE FINANCIAL RESULTS FOR THE QUARTER/YEAR ENDED 31st MARCH, 2025

Rs. in Lakhs except per share data

Sl. No.	Particulars	Quarter Ended 31.03.2025	Quarter Ended 31.03.2024	Year ended 31.03.2025	Year ended 31.03.2024
1.	Total income from operations	111.97	-	111.97	21.4
2.	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and / or Extraordinary items)	93.19	-2.61	90.52	-4.58
3.	Net Profit /(Loss) for the period before tax (after Exceptional and / or Extraordinary items)	93.19	-2.61	90.52	-4.58
4.	Net Profit/(Loss) for the period after tax (after Exceptional and /or Extraordinary items)	93.19	-2.61	90.52	-4.58
5.	Total Comprehensive income for the period [Comprising Profit / (Loss) for the period (after tax) and Other Comprehensive Income (after tax)]	93.19	-2.61	90.52	-4.58
6.	Equity share Capital	211.50	211.50	211.50	211.50
7.	Reserves (excluding Revaluation Reserve) as shown in the Audited Balance Sheet of the previous year	-	-	-	-
8.	Earnings Per Share(of Rs.10/-each) (for continuing and discontinued operations) 1. Basic : 2. Diluted :	4.41 4.41	-0.12 -0.12	4.28 4.28	-0.22 -0.22

Notes:
1. The above is an extracts of the detailed format of Audited Standalone Financial Results of the Company for the quarter and year ended 31st March, 2025, filed with Stock Exchange Under Regulation 33 of the SEBI (Listing and Other Disclosure Requirements) Regulations 2015
2. These results were review by the Audit committee and were thereafter approved by the Board of Directors at their meeting held on 30th May, 2025.
3. As the Company has suspended it's manufacturing operations and has sold of its land, buildings and manufacturing facilities and in the absence of final action plan / affairs and operations of the Company, The financial statement of the Company have not been prepared on a going concern basis. These financial statements/results have been prepared on a raisable value basis.
4. The previous financial period figures have been regrouped / re-arranged/re-stated wherever considered necessary.

For Deccan Polypacks Limited
D V PRUDVI RAJU
Wholetime Director
DIN : 03024648

Place : Hyderabad
Date : 30.05.2025

జూన్ 2న జాతీయ పతాకావిష్కరణ

- అతిథులను ప్రకటించిన ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూన్ 2 తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో అధికారికంగా నిర్వహిస్తున్న వేడుకల్లో జాతీయ పతాకావిష్కరణ చేసేందుకు అతిథులను ప్రభుత్వం ప్రకటించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను సిఎస్ రామకృష్ణారావు శుక్రవారం విడుదల చేశారు. హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి వేడుకలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. మిగిలిన 32 జిల్లాల్లో మంత్రులు, ప్రభుత్వంలోని ఇతర ప్రముఖులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ వేడుకల్లో ముందుగా అమరవీరులకు నివాళులర్పిస్తారు. ఆయా జిల్లాల్లో జెండావిష్కరణతో సంబరాలు మొదలవుతాయి. భద్రాద్రి కొత్తగూడెంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కరీంనగర్‌లో మంత్రి శ్రీధర్‌బాబు, మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు, ములుగులో మంత్రి సీతక్క, నల్లగొండలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంగారెడ్డిలో దామోదర రాజనర్సింహ, సిద్ధిపేటలో మంత్రి పొన్నం ప్రభాకర్, సూర్యాపేటలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వరంగల్‌లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, హన్మకొండలో కొండా సురేఖ జెండావిష్కరణలో పాల్గొననున్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వికారాబాద్‌లో, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి యాదాద్రి భువనగిరిలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తారు. మిగిలిన జిల్లాల్లో ఇతర ప్రముఖులు పాల్గొంటారు. జిల్లాల్లో జరిగే వేడుకల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు భాగస్వాములవుతారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాల్లో ఉదయం 9.30 గంటలలోపు జెండావిష్కరణ పూర్తి చేయాలని ఆదేశించింది.

కోసోల్ ఎనర్జీకి ఉత్తమ సోలార్ బ్రాండ్ అవార్డు

హైదరాబాద్ : ఉత్తమ సోలార్ బ్రాండ్ ఆఫ్ ఇయర్ అవార్డు పొందినట్లు కోసోల్ ఎనర్జీ తెలిపింది. రెన్యూవబుల్ ఎనర్జీ రంగంలో కంపెనీ ప్రఖ్యాత బిఎఆర్‌సి ఏషియా అందించే 'బెస్ట్ సోలార్ బ్రాండ్ ఆఫ్ ది ఇయర్ 2025' అందుకున్నట్లు పేర్కొంది. దీన్ని గోవా ఉపాధి కమిషనర్ ఆగ్నెలో ఫెర్నాండేజ్, హెరాల్డ్ గ్లోబల్ పబ్లిషింగ్ డైరెక్టర్ చైతీ సేన్ కోసోల్ ఎనర్జీకి అందించారని పేర్కొంది.

EYANTRA VENTURES LIMITED
CIN: L72100TG1984PLC167149
Regd. Office: 301, 3rd Floor, CSR Estate, Plot No. 8, Sector - 1, HUDA Techno Enclave, Madhapur Main Road, Hyderabad -500081, Telangana, India. Ph. No: +91-7702974403, Email ID: support@eyantraventures.com

మార్చి 31, 2025తో ముగిసిన త్రైమాసికం మరియు ఆర్థిక సం॥ కొరకు ఎంత్రా వెంచర్స్ లిమిటెడ్ (కంపెనీ) యొక్క స్టాండలోన్ & కన్సాలిడేటెడ్ ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాల నివేదిక

కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్లు మే 30, 2025న నిర్వహించబడిన వారి సమావేశంలో, మార్చి 31, 2025తో ముగిసిన త్రైమాసికం మరియు ఆర్థిక సం॥ కొరకు కంపెనీ యొక్క స్టాండలోన్ & కన్సాలిడేటెడ్ ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాలు ఆమోదించబడినవి. పై పేర్కొన్న ఆర్థిక ఫలితాలును కంపెనీ యొక్క చట్టబద్ద ఆడిటర్లచేత జారీచేయబడిన ఆడిట్ రిపోర్టులు కంపెనీ యొక్క వెబ్‌సైట్ https://eyantraventures.com/result-announcement/ వద్ద అందుబాటులో ఉంటాయి మరియు దిగువ ఇవ్వబడిన క్విక్ రెస్పాన్స్ (క్యూఆర్)ను స్కాన్‌చేయుట ద్వారా కూడా అక్సెస్ చేయవచ్చును.

తేది: 30.05.2025,
ప్రదేశం: హైదరాబాద్,

బోర్డు ఆదేశం మేరకు,
ఎంత్ర వెంచర్స్ లిమిటెడ్ తరపున,
సం/-
వినిత రాజ్ నారాయణం
చైర్ పర్సన్ & మేనేజింగ్ డైరెక్టర్,
డిఐఎన్: 09319780.

త్వరలో "ఇందిరమ్మ భూముల పంపిణీ"

బిజెపి, బిఆర్ఎస్ దోస్తానా

కవిత ఎపిసోడ్ టీ కప్పులో తుపానులాంటిది

భూ బకాసురుల సంగతి త్వరలో తేలుస్తాం : మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్వరలో పేదలకు ఇందిరమ్మ భూములు ఇచ్చేందుకు ప్రభుత్వ సుముఖంగా ఉన్నదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన సచివాలయంలో మీడియాతో చిట్ చాట్ చేస్తూ...ఇందిరమ్మ హయంలో తెలంగాణలో 25 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేశారన్నారు. ఆ తర్వాత పేదలను మోసం చేసి పెత్తందారులు, భూ స్వాములు ఆ భూములను గుంజుకున్నట్లు మంత్రి వివరించారు. గత పదేళ్లలో ఈ విధానం ఎక్కువగా జరిగిందన్నారు. అందుకే అసైన్డ్ భూములను ఎంక్వైయిరీ చేసి పేదలవా? కావా? అనేది తేల్చుతామన్నారు. పేదల నుంచి పేదలకు భూమి ట్రాన్స్ ఫర్ అయితే ఏం కాదని, కానీ భూ స్వాములు, కార్పొరేట్ వ్యవస్థలు, శక్తులు, సంస్థలు, భూ బకారసులకు అసైన్డ్ భూములు ఉన్నాయని తేలితే, వెంటనే సర్కార్ స్వాధీనం చేసుకోనుందన్నారు. దాన్ని మిగతా పేద కుటుంబాలకు అందజేస్తామన్నారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా 1.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకోక, ఇప్పటికే 2.10 లక్షల లబ్దిదారులను ఎంపిక చేశామన్నారు. దీనికి అదనంగా చెంచులు, ఉప కులాలకు మరో 9200 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయబోతున్నామన్నారు. ఇప్పటికే అర్హుల లిస్టు ఇన్ చార్జీ మంత్రులకు చేరిందన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఇచ్చిన లిస్టు ను కూడా కన్సిడర్ చేశామన్నారు. కెటిఆర్ మాత్రం ఎలాంటి లిస్టు ఇవ్వలేదన్నారు. పార్టీలకు అతీతంగా పేదలకు స్కీమ్ లు అందజేస్తామన్నారు. ఇక పైలెట్ ప్రాజెక్టులో 42 వేలు ఇళ్లు టార్గెట్ పెట్టుకోగా, ఇప్పటికే 24 వేలు ఇళ్లకు పేమెంట్లు ఇచ్చామన్నారు. వీటిలో కొన్ని 15- 20 రోజుల్లోనే గృహ ప్రవేశాలు చేయబోతున్నామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఇసుక, ఇటుక ధరలు నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నదన్నారు. జిల్లా స్థాయిలో అడిషనల్ కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీ వేశామన్నారు. ఏడాది కిందటి ధరలుకే పంపిణీ చేయాలని వ్యాపారాలను ప్రభుత్వం కోరిందన్నారు. ఇక అర్బన్ ఏరియాల్లో గతంలో లాగా దూర ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించబోమని మంత్రి పొంగులేటి తెలిపారు. జీ ప్లస్ 3, జీ ప్లస్ నాలుగు లో క్లోజ్ చేస్తామన్నారు. ఇప్పటికే హైదరాబాద్ లో 16 స్లమ్స్ ను గుర్తించామని, వారికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ, ఆదిలాబాద్, మహబూబ్ నగర్, వంటి సిటీల్లోనూ ఈ పాలసీని అమలు చేస్తామన్నారు. గతంలో అర్బన్ ఏరియాల నుంచి 25 నుంచి 30 కి.మీ దూరంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారని, దీంతో సిటీలో ఉపాధి పొందే వాళ్లకు నష్టం జరిగిందన్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రూ. ఐదు లక్షల ఇళ్లతో పేదల చిరకల స్వప్నం తీరబోతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో దాదాపు 90 శాతం గ్రామాల్లో పేదలకు ఇళ్లు అందే అవకాశం ఉన్నదన్నారు.

ఇక భూ భారతిని నాలుగు మండలాల్లో పైలెట్ మోడ్ లో అమలు చేసి, సమస్యలు తెలుసుకుంటూ పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. భూ భారతి ద్వారా సాధాబైనమా భూములు కాకుండా మిగతవన్నీ క్లియర్ చేస్తామన్నారు. 95 శాతం దరఖాస్తు దారులకు సమస్య పరిష్కరించబడుతుందన్నారు. ధరణిలో 9.26 లక్షల అప్లికేషన్లు వచ్చాయని, వీటిలో కొన్ని సుప్రీం కోర్టులో కేసులు ఉన్నాయన్నారు. సాధాబైనామాల్లో కొన్ని ఫేక్ ఉన్నాయని, వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల గెట్లు తెంచేందుకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సర్వే నంబరు, రికార్డు, భూముల ప్రకారం రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఎంక్వైయిరీ చేసి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఇందు కోసం సర్వేయర్లు పనిచేస్తారన్నారు. ఆరు వేల సర్వేయర్లను తీసుకోబోతున్నామన్నారు. లైసెన్స్ డ్ సర్వేయర్లకు ఇప్పటికే ట్రైనింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. గ్రామాల్లో జీపీవో లు కూడా రాబోతున్నారన్నారు. ఇక ఏఐ టెక్నాలజీ వినియోగించి రిజిస్ట్రేషన్లలో పారదర్శకతను చూపుతున్నామన్నారు. స్లాట్ విధానం వలన కొన్ని సమస్యలకు చెక్ పెట్టొచ్చన్నారు. భూములపై ఫోరెన్సిక్ అడిట్ కూడా నిర్వహించబోతున్నామన్నారు. దీని వలన కేవలం 15 నుంచి 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్లు పూర్తి కావడంతో పాటు వెయిటింగ్ పీరియడ్ తగ్గుతుందన్నారు. అవినీతి చేసేందుకు ఆస్కారం ఉండదన్నారు. రిజిస్ట్రేషన్ ఎందుకు కాదనేదానిపై ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చేలా క్లాజ్ పొందుపరిచామన్నారు.

ఢిల్లీలో బిజెపి, బిఆర్ఎస్‌కు దోస్తానా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. కవితనే ఈ విషయం స్వయంగా చెబుతున్నారని వెల్లడించారు. కవిత ఎపిసోడ్ టీ కప్పులో తుపాన్ అని కొట్టిపారేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కటి కాదు చాలా తప్పులు చేశారని... అన్నిటికి శిక్ష తప్పదని వార్నింగ్ ఇచ్చారు. కెసిఆర్ దగ్గర దెయ్యాలు ఉన్నాయని కవిత అంటున్నారని.. ఆ దెయ్యాలు ఎవరో కవితనే చెప్పాలని అన్నారు. దేవుడు, దెయ్యాలు అంటున్న కవిత నోరు ఎందుకు విప్పడం లేదని ప్రశ్నించారు. కవిత నోరు విప్పాలని.. ఆమె ఏం చెబుతుందో వినాలని తాము కూడా చూస్తున్నామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌కి బీజేపీతో బంధం ఉందని కవిత స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. బిజెపి ఎమ్మెల్యే కూడా ఈ విషయాన్ని అంగీకరించారని చెప్పారు.

కగార్ పేరుతో విధ్వంసం

- కాంగ్రెస్, బిజెపి ద్వంద్వ వైఖరి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్, బిజెపి ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నాయని, ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మారణహోమం సృష్టిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలో పర్యటించిన ఆమె.. సీనియర్ జర్నలిస్ట్ మునీర్ మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో మునీర్ ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో బిజెపి ప్రభుత్వం దేశంలో మారణకాండ సృష్టిస్తోందన్నారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో చనిపోతే మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పకుండా అంత్యక్రియలు సైతం ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. దళిత నాయకులపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని, మొన్న జరిగిన సరస్వతీ పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ ఫొటో పెట్టలేదని అన్నారు. యాదగిరి గుట్టలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కింద కూర్చోబెట్టి సిఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి పైన కూర్చున్నారని అన్నారు. తనకు అవమానం జరిగిందంటూ గడ్డం వంశీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారన్నారు. కాంగ్రెస్, బిజెపి రెండూ సమసమాజ నిర్మాణానికి వ్యతిరేకంగా పని చేస్తున్నాయని, దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. అనంతరం టిబిజికెఎస్ ముఖ్య నాయకులు మిర్యాల రాజిరెడ్డి, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డితో కలిసి మంచిర్యాలలోని సింగరేణి కార్మికుడు హర్ష ఇంట్లో సమావేశమయ్యారు. అనంతరం లక్ష్మినగర్‌లోని రియల్ ఎస్టేట్ వ్యాపారి నీలి శ్రీనివాస్ ఇంటికెళ్లిన కవితకు కుటుంబ సభ్యులు పసుపు బొట్టు, చీర పెట్టి సన్మానించారు.

బిఆర్ఎస్ నాయకులు గైర్హాజరు

మంచిర్యాల జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటనలో బిఆర్ఎస్ జిల్లా నాయకులెవరూ కనిపించకపోవడం స్థానికంగా చర్చకు దారి తీసింది. జిల్లాలోని పలు వివాహాలు, మునీర్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు మంచిర్యాలకు వచ్చిన కవితను బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు, బిఆర్ఎస్ నాయకులెవరూ కలవలేదు. దాంతో కవిత కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో ఉందని స్థానికుల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. స్థానికంగా ఉండే కార్మిక సంఘాల నాయకులతో జిల్లా కేంద్రంలో కవిత సమావేశం నిర్వహించినట్టు సమాచారం.

యువతికి మత్తుమందు ఇచ్చి లైంగిక దాడి..

- 2023లో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత్తుమందు ఇచ్చి మహిళపై లైంగికదాడికి పాల్పడటంతో పాటు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెం 7లో నివాసం ఉంటున్న మహేంద్ర వర్ధన్ అనే వ్యక్తికి 2023 ఫిబ్రవరిలో 24 ఏళ్ల యువతితో పరిచయం ఏర్పడింది. కొన్నాళ్లపాటు ఇరువురు ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో అదే ఏడాది ఆగస్టు 15న మహేంద్రవర్ధన్ తన నివాసానికి యువతిని భోజనానికి ఆహ్వానించాడు. ఇంటికి వచ్చిన ఆమెను మాటల్లో పెట్టి మత్తుమందు ఇచ్చి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ దారుణాన్నంతా ఫోన్‌లో రికార్డు చేసుకున్నాడు. మరుసటి రోజు ఉదయం నిద్రలేచిన యువతికి వాటిని చూపించి బెదిరింపులకు పాల్పడ్డాడు. తనకు రూ.20 లక్షలు ఇవ్వాలని, లేదంటే ఆ ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. భయపడిన యువతి అతను అడిగిన మొత్తాన్ని చెల్లించింది. అయితే కొన్నాళ్లుగా మహేంద్రవర్ధన్ బాధితురాలిని ఇలా బెదిరించడం అడిగినంత తీసుకోవడం చేస్తున్నాడు. తాజాగా ఏకంగా కోటి రూపాయలు ఇవ్వాలని యువతిని డిమాండ్ చేశాడు. అంత మొత్తం ఇవ్వలేనని ఆమె వేడుకున్నా.. ఫొటోలు, వీడియోలు నెట్‌లో పెడతానని నిరంతరం బెదిరించాడు. దాంతో బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని తెలిసింది.

సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సంయుక్త కార్మిక కమిషనర్ (హెడ్ క్వార్టర్స్) ఆర్.చంద్రశేఖరంకు సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపాల్ మాట్లాడుతూ కొమరంభీం జిల్లా సిర్పూర్ కాగజ్ నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి తర్వాత నిలుపుదల చేశారని తెలిపారు. 2024 నవంబర్‌లో మిల్లులోని అన్ని రిజిష్టర్ కార్మిక సంఘాలకు అదిలాబాద్ డిప్యూటీ లేబర్ కమిషనర్ లెటర్లు పంపించారని వివరించారు. నవంబర్ మూడో తారీఖు లోపు యూనియన్ల వివరాలు, మాన్యువల్ రిటర్న్లు, సమర్పించిన ఎకనాలెడ్జిమెంట్ అందయాలని ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ మేరకు అన్ని కార్మిక సంఘాలు వివరాలు అందజేశాయని తెలిపారు. ఏడు నెల్లు గడిచినప్పటికీ అదిలాబాద్ డిసిఎల్ ఆఫీసు నుండి ఎలాంటి స్పందన రాకపోవటంతో మార్చి 20న కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కలవటంతో ఆదిలాబాద్ డీసీఎల్ ఎన్నికల పక్రియ ప్రారంభించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. కార్మిక సమస్యలపై ఎప్పటికప్పుడు యజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులు సమస్యలు పరిష్కారం చేసే గుర్తింపు సంఘం లేనందున అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో గుర్తింపు సంఘం కోసం రహస్య బ్యాలెట్ ఎన్నికలు పక్రియను వేగవంతం వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ కూశన రాజన్న, వైస్ ప్రెసిడెంట్ ముంజం శ్రీనివాస్ సిఐటియు జిల్లా అధ్యక్షులు రాజేందర్ ఉపాధ్యక్షులు శ్రీకాంత్, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విదేశాల నుంచి వస్తున్న ఒక ప్రయాణికుని వద్ద శుక్రవారం అధికారులు గంజాయిని పట్టుకున్నారు. ఆర్‌జీఐ ఎయిర్ పోర్టు ఔట్ పోస్టు పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంకాక్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వస్తున్న తాయి ఎయిర్ లైన్స్ 329 విమానంలో వచ్చిన ప్రయాణికుడ్ని అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా అతని వద్ద గంజాయిని గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద ఉన్న పది కిలోల గాంజా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిపిఒలతో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం

- వి లచ్చిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారమే గ్రామ పరిపాలన అధికారుల (జిపిఒ) నియామకం జరుగుతుందని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామానికో అధికారిని నియమించబోతున్నారని తెలిపారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతంతో భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. జిపిఒల నియామకంతో రెవెన్యూ వ్యవస్థ కూడా బలోపేతం అవుతుందని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి కృషి ఫలితంగానే ఇదంతా సాధ్యమైందని పేర్కొన్నారు. జీపీఓల నియామకానికి సంబంధించిన ప్రక్రియ వేగవంతంగా సాగుతుందనీ, అందులో భాగంగానే ఇటీవల జీపీఓల నియామకానికి పరీక్షను నిర్వహించారని తెలిపారు. శుక్రవారం పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, జిపిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గరికె ఉపేందర్ రావు, లక్ష్మి నరసింహా, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

పేరుకే వంట మాస్టర్.. చేసేది డ్రగ్స్ వ్యాపారం

- షాద్‌నగర్ వద్ద దాబాలో రూ.3.5 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత
- నిందితుడు అరెస్టు, రిమాండ్ : సిపి అవినాష్ మహంతి

మీడియాతో మాట్లాడుతున్న సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాల క్రయవిక్రయాలను నిషేధించేందుకు పటిష్ట చర్యలు చేపట్టిన క్రమంలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని టోల్ ప్లాజా సమీపంలో రూ. మూడు కోట్ల విలువైన మాదకద్రవ్యాలను పోలీసులు పట్టుకోవడం సంచలనం రేకెత్తించింది. రాయికల్ టోల్‌గేట్ సమీపంలోని ఓ మార్వాడీ దాబాలో ఓ వ్యక్తి మాదకద్రవ్యాలను అమ్ముతున్నాడన్న విశ్వసనీయ సమాచారంతో షాద్‌నగర్, శంషాబాద్ ఎస్ఒటి పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో మాదకద్రవ్యాల అమ్మకాల గుట్టు రట్టయింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ కమిషనరేట్‌లో సిపి అవినాష్ మహంతి మీడియాకు శుక్రవారం వెల్లడించారు. రాజస్థాన్‌లోని మౌలాసర్‌కు చెందిన వికాస్ సోహు 2019లో షాద్‌నగర్ సమీపంలోని రాయికల్ టోల్‌గేట్ ఎన్‌హెచ్ 44 సమీపంలోని సంజు భాయ్ మార్వాడీ దాబాలో పనికి వచ్చాడు. ముందుగా వాచ్‌మెన్‌గా పనిచేశాడు. నెమ్మదిగా వంట నేర్చుకున్నాడు. ఆ తరువాత వంట మాస్టర్‌గా పనిచేశాడు. అయితే, దాబా యజమాని సంజు భాయ్‌కి గంజాయి తాగే అలవాటు ఉంది. ఇతను ధూల్‌పేటలోని సలీం రౌటర్ అనే వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసేవాడు. ఎవరైనా గంజాయి అడిగితే, అతను దాన్ని వారికి ఎక్కువ ధరకు అమ్మేవాడు. దాబాకు వచ్చే ఇతర రాష్ట్రాల డ్రైవర్లు, లారీ డ్రైవర్లు, పాదచారులు, మొదలైన వారికి అమ్మేవాడు. వీరికి దుల్‌పేటకు చెందిన సలీమ్, మహేశ్వరంకు చెందిన రాజు, మధ్యప్రదేశ్‌కు చెందిన గన్పథ్ సహకరించేవారు. ఈ క్రమంలోనే దాబాలో గంజాయి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే షాద్‌నగర్, శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో వికాస్ సోహును అరెస్టు చేశారు. అతన్ని విచారించగా భారీగా మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి.

ఒపిఎం 632 గ్రాములు, కేజీ గంజాయి, 1.5 కేజీల హెరాయిన్, 2.8 కేజీల పప్పి స్ట్రా స్వాధీనం చేసుకున్నారు. అలాగే 87,700 నగదు, రూ.30వేల విలువైన 3 మొబైల్ ఫోన్లు, వేయింగ్ మెషీన్, ప్యాకింగ్ కవర్ ప్యాకెట్ సీజ్ చేశారు. మిగతా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు సీపీ తెలిపారు. భారీగా మారకద్రవ్యాలను పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన పోలీసు సిబ్బందిని సిపి అభినందించారు.

తాటి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుని మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాటి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెలువర్తి గ్రామంలో శుక్రవారం జరిగింది. మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వెలువర్తి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు కొమ్మగాని వెంకటేశం (43) శుక్రవారం ఉదయం రోజుమాదిరిగానే వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కుతుండగా కాలుజారి కింద పడడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం ఆయన్ను భువనగిరి ఏరియాస్పత్రికి 108లో తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. కాగా, మతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, వలిగొండ మండల కార్యదర్శి గాజుల ఆంజనేయులు కోరారు. వెంకటేశం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మండల నాయకులు పలుసం స్వామి, గ్రామ సొసైటీ అధ్యక్షులు పరకాల ముత్యాలు, పరకాల వెంకటేశం, మల్లేశం శ్రీశైలం ఉన్నారు.

అగ్ని ప్రమాద ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- గుల్జర్ హౌస్ అగ్ని ప్రమాద బాధిత కుటుంబసభ్యులు

మీడియాతో మాట్లాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల హైదరాబాద్‌లోని గుల్జర్ హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని బాధిత కుటుంబానికి చెందిన సంతోష్ గుప్తా కోరారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో అగ్నిప్రమాద బాధిత కుటుంబసభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోషామహల్ నివాసి శ్రీనివాస్, న్యాయవాది అతుల్ అగర్వాల్, నితీష్ గుప్తాతో కలిసి ఆయన మాట్లాడారు. అగ్నిమాపక శాఖ నిర్లక్ష్యం వల్లే 17 మంది ప్రాణాలు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన గంట వరకు అగ్నిమాపక శాఖ వాహనాలు రాలేదని, వచ్చిన వాహనాల్లో సరైన సిబ్బంది, నీటి సదుపాయం లేకపోవడంతోనే మరణాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. సరైన సమయంలో ఫైర్ సిబ్బంది స్పందించి ఉంటే ప్రమాదంలో తమ వాళ్లను కోల్పోయే వాళ్ళం కాదన్నారు. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తీసుకువెళ్లిన అనంతరం ఉస్మానియా వైద్యుల నిర్లక్ష్యంతో ముగ్గురు మృతిచెందారని విచారం వ్యక్తం చేశారు. ఆస్పత్రికి వెళ్లిన తర్వాత ఎఫ్ఐఆర్ లేకుండా చికిత్స చేయలేమని చెప్పారని అన్నారు. అలాగే ఈ ఘటనపై ప్రభుత్వం వేసిన కమిటీ ఇప్పటివరకు తమను కలవలేదని తెలిపారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్న నేపథ్యంలో ఈ ఘటనపై జ్యూడిషియల్ ఎంక్వయిరీ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పట్టిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం జ్యూడిషియల్ ఎంక్వయిరీ ఆదేశించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు. ప్రభుత్వ అధికారులు ఈ ఘటనపై నిర్లక్ష్యంగా మాట్లాడటం తమను తీవ్రంగా కలిచి వేస్తున్నదన్నారు.

న్యాయం చేయాలంటూ.. ఐటిసి కార్మికుని కుటుంబసభ్యుల ఆందోళన

- కుటుంబానికి అండగా ఉంటా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక ఐటిసిలో కాంట్రాక్ట్ కార్మికునిగా పనిచేస్తున్న హరీశ్ గురువారం ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని భద్రాచలం ఏరియా హాస్పిటల్ మార్చురీకి తరలించారు. దాంతో మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ఆదివాసీ సంఘాలు, కుటుంబ సభ్యులు శుక్రవారం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. మృతదేహాన్ని పరిశీలించడానికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఐటిసి యజమాన్యంతో మాట్లాడి బాధిత కుటుంబానికి స్థానిక ఎమ్మెలే, ఆదివాసీ సంఘ నాయకులు అండగా నిలిచారు. వెంటనే ఐటీసీ కాంట్రాక్టర్‌ను అక్కడికి పిలిపించి మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా కల్పించారు. హరీశ్ తల్లికి నెలకు రూ.9 వేలు పెన్షన్, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, కుటుంబానికి రూ.14.50 లక్షలు ఇస్తామని కాంట్రాక్టర్ ఒప్పుకున్నారు. లక్ష రూపాయలు నగదు రూపంలో ఇవ్వగా, మూడు లక్షల రూపాయలు చెక్కు రూపంలో అందజేశారు. మిగతావి కార్యక్రమం అయిపోయిన మరుసటి రోజే ఇస్తానని కాంట్రాక్టర్ వారికి హామీ పత్రం అందజేశారు. హరీశ్ కుటుంబ సభ్యులకు సహకరించిన ప్రతి ఒక్కరికీ వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మిక్సోపతి ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలి

- టి జూడా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటిగ్రేటివ్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఎంబిబిఎస్, బిఎఎంఎస్ కలయిక) పేరుతో తేవాలనుకుంటున్న మిక్సోపతి ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్ అధ్యక్షులు జె.ఐజాక్ న్యూటన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.అజయ్ కుమార్ గౌడ్, చైర్ పర్సన్ డాక్టర్ కె.మదన్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే పలు దేశాల్లో ఇలాంటి ప్రయోగాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. ఆయుర్వేద డాక్టర్లు కూడా ఈ విధానాన్ని వ్యతిరేకించాలని కోరారు.

నకిలీ పత్తి విత్తనాల దందా

- 9 మంది అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు
- రూ.14 లక్షల విలువైన 560 కేజీల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం
- విచారణ కొనసాగుతోంది : ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లాలో నకిలీ విత్తనాల దందా సాగుతోంది. దాంతో ఖమ్మం పోలీసులు అప్రమత్తమై కుటీర పరిశ్రమగా వర్ధిల్లుతున్న నకిలీ పత్తి విత్తనాల తయారీ కేంద్రంపై పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. మూడు వేర్వేరు చోట్ల పోలీసులు జరిపిన దాడుల్లో రూ.14 లక్షల విలువైన 560 కేజీల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మందిని అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. దీనిపై ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ఏన్కూరు పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 28వ తేదీ ఉదయం ఏన్కూర్ పోలీసులు, వ్యవసాయ అధికారుల ఉమ్మడి తనిఖీల్లో భాగంగా ఏన్కూర్ గ్రామానికి చెందిన జి నరసింహారావు కొద్దిమంది రైతులకు అనుమతిలేని పత్తి విత్తనాలను అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనిఖీ నిర్వహించగా అతని వద్ద 450 గ్రాముల అడ్వాన్స్ 555 పేర్లతో పత్తి విత్తనాల ప్యాకెట్లు దొరకగా సీజ్ చేశారు. కల్లూరు ఎస్ఐ డి హరిత ఒక టీమ్ ఏర్పాటు చేసి తదుపరి విచారణ చేయగా ఈ పత్తి విత్తనాలను ఆంధ్రప్రదేశ్‌లోని మైలవరం మండలం చంద్రుగూడెం గ్రామానికి చెందిన శాలివాహన అనే వ్యక్తి వద్ద నుంచి తెచ్చి అమ్ముతున్నట్టు తేలింది. 450 గ్రాముల ప్యాకెట్లను అక్కడ రూ.400కు కొనుక్కొచ్చి ఇక్కడ రూ.1,200కు అమ్ముతున్నట్టు విచారణలో వెలుగులోనికి వచ్చింది. ఈ విషయంపై ఖమ్మం సిపి ఆదేశాల మేరకు కల్లూరు ఎస్ఐ డి.హరిత ఆధ్వర్యంలో ఒక టీమ్.. మైలవరం మండలం చంద్రుగూడెం గ్రామానికి వెళ్లింది. శాలివాహన ఇంటి వద్ద ఒక కుటీర పరిశ్రమలాగా నకిలీ పత్తి విత్తనాలు తయారు చేస్తున్నట్టుగా గుర్తించారు. అతను కర్ణాటక నుంచి పత్తి విత్తనాలను, వాటిని ట్యాగ్ చేయడానికి ప్రింటెడ్ అడ్వాన్స్ ట్రిబుల్ ఫై నెంబర్ గల కవర్ ఉన్న ప్యాకెట్స్‌తో తీసుకొచ్చి తన వద్ద ఉన్న విత్తనాలను రైజోబెల్ మిశ్రమాన్ని కలిపి ఆరబెట్టి ఆ పత్తి విత్తనాలను ప్యాకెట్లలో నింపి సీల్ చేసి అమ్ముతున్నారు. జి. నరసింహారావు, మరి కొంతమంది ఏజెంట్ల ద్వారా రైతులకు అధిక దిగుబడి వస్తుందని, అలాగే కలుపు మందు వలన ఇబ్బంది ఉండదని నమ్మించి ఒక్కొక్క ప్యాకెట్‌ను రూ.1200కు రైతులకు అమ్ముతున్నారని తెలిసింది. అతని ఇంటి వద్ద నుంచి ఒక క్వింటా కలిపి పెట్టిన రైజోబెల్ మిశ్రమం, ప్యాక్ చేయకుండా ఉన్న పత్తి విత్తనాలు, 450గ్రాములు బరువు కలిగి అరుణోదయ లేబల్‌తో ఉన్న 272 పత్తి విత్తన ప్యాకెట్లను, ప్యాకెట్ సీల్ చేయడానికి వాడే 2మిషన్లు, ఒక వేయింగ్ మిషన్, పత్తి విత్తనాలు ప్యాకింగ్ చేయడానికి అరుణోదయ లేబల్‌తో ఉన్న సుమారు 400 ఖాళీ ప్యాకెట్లు, రెండు లీటర్ల రైజోబెన్ మిశ్రమాన్ని సీజ్ చేశారు.అలాగే రేపల్లెవాడ గ్రామ శివారున నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నారన్న సమాచారం మేరకు వెనిగండ్ల శ్రీహరిరావు అనే వ్యక్తి వ్యవసాయ భూమిలో తనిఖీలు నిర్వహించగా అక్కడ 210 కిలోల నకిలీ పత్తి విత్తనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి వెనిగండ్ల శ్రీధర్‌రావు ఇచ్చిన సమాచారం మేరకు అతని అనుచరుడైన కిషోర్ ఇంటి వద్ద తనిఖీ చేయగా సుమారు 120 కిలోల పత్తి విత్తనాలు లభించాయి. అలాగే పత్తి విత్తనాలు తయారు చేయడానికి ఉపయోగిస్తున్న రైజోబిన్ కెమికల్, వేయింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. శ్రీహరిరావు కొంతకాలంగా బాపట్ల జిల్లాలో ఉన్న తన బంధువైన లక్ష్మీనారాయణ ద్వారా కిలో రూ.800కి నకిలీ, ఎటువంటి అనుమతి లేని విత్తనాలు తెప్పిస్తూ ఏన్కూరు మండల రైతులకు అధిక దిగుబడి వస్తున్న వంగడాలని నమ్మించి కిలో రూ.2,600 అమ్ముతూ లాభాలు గడిస్తున్నారని విచారణలో తెలిసింది. శుక్రవారం ఏన్కూర్ ఎస్ఐ రఫీకి వచ్చిన సమాచారం మేరకు ఏన్కూరులో పి కోటేశ్వరరావు ఇంటి వద్ద తనిఖీ చేయగా అతని వద్ద నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు 20 లభించాయి. అతన్ని విచారించగా ఏపీలోని తెనాలి జిల్లా నుంచి తీసుకొచ్చి అమ్ముతున్నారని తెలిసింది. ఈ సంఘటనకు సంబంధించి వి శ్రీహరిరావు, యు నరేష్, అన్నెం లక్ష్మీనారాయణ, జి గోపి, వి రమేశ్, టి నవీన్, డి రమేష్, జి నరసింహారావు, సిహెచ్ శాలివాహన, పి కోటేశ్వరరావు, వి రవిలపై కేసులు నమోదయ్యాయని వీరిలో తొమ్మిది మందిని అరెస్ట్ చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసిరకం, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదని సిపి తెలిపారు. ముఖ్యంగా రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో అప్రమత్తంగా ఉండాలని, తక్కువ ధరలకు తెలియని వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి మోసపోవద్దని అన్నారు. కొంతమంది దళారులు ముఠాలుగా ఏర్పడి తక్కువ డబ్బుకు విత్తనాలు ఇస్తామని ఆశ చూపి రైతులను మోసం చేస్తారని, ఇటువంటి వారిపై గ్రామాల్లో సైతం నిఘా పెట్టామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కల్లూరు ఏసిపి రఘు, సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగం, ఎస్ఐ రఫీ, ఎస్ఐ హరిత తదితరులు పాల్గొన్నారు.